

కొత్త ఢిల్లీ. రోడ్డంతా జనంతో కిటకిటలాడుతూంది. ఎయిర్ కండిషన్డ్ జనపథ్ హోటల్లో జనం రద్దీ క్రమంగా ఎక్కువవుతూంది. సాయంకాలం టీ, ఫలహారం పుచ్చుకునేవేళ అయిపోవచ్చింది. తెల్లని దుస్తులు వేసుకున్న హోటలు కుర్రాళ్లు రాత్రి భోజనానికి బల్లలు, కుర్చీలు అమరుస్తున్నారు. ఎక్కువమంది కూర్చునేందుకు వీలుగా రెండేసి కుర్చీలు కలిపి దగ్గిరగా వేస్తున్నారు. బల్లలమీద కాఫీ, టీ మరకలున్న గుడ్డలు పోయి, తెల్లని ఇస్త్రీమడతలు అలంకరిస్తున్నాయి.

దళసరి అద్దాల తలుపులు ఉండీ ఉండీ తెరుచుకుని మూసుకుంటున్నాయి. నేను కూర్చున్న బల్ల దగ్గిర్నుంచి చూస్తే ఎప్పుడూ ఎవరో ఒకరు తలుపు తీసుకు వస్తూ పోతూ ఉన్నట్లే ఉంది. నా స్నేహితుడు ఎంచక్కా కబుర్లు చెబుతున్నాడు. బల్లమీద రుచికరమైన పదార్థాలున్నాయి. కానీ, నా దృష్టి తలుపు తోసుకు వస్తూ పోతున్న జనంమీదే ఉంది.

ఒక జంట లోపలికి ప్రవేశించారు. ఆ జంట దంపతులు మాత్రం కారు. ఆమె దుస్తులు తమాషాగా ఉన్నాయి. కూడా ఉన్న అతను భారతీయుడు. మా బల్లకి దూరంగా కూర్చున్నారు వాళ్లు. భోజనానికి ఏం కావాలో చెప్పకముందే దీర్ఘ సంభాషణలో మునిగిపోయారు. బేరర్ మెనూ కార్డు పట్టుకుని కాచుకుని నిలబడ్డాడు. వాళ్ల సంభాషణకి అడ్డు పడలేడు కదా? అమర్యాదగా ఉంటుంది మరి. కానీ, అతని ముఖం విసుగ్గా ఉంది.

"ఏమిటి చూస్తున్నావు?" అడిగాడు నా స్నేహితుడు.

"ఆ జంటవంక."

"వాళ్లు దంపతులు కారు. ప్రేయసీ ప్రియులు అంతకంటె కారు. ఆ అమ్మాయి ఎంత చక్కగా ఉందో చూశావా?"

"ఆఁ. కానీ, ప్రస్తుతం ఆ విషయాన్ని గురించి ఏం మాట్లాడదలుచుకో లేదు. వాళ్ల విషయం వినాలనికూడా లేదు. మౌనంగా చూడాలని ఉంది ఆటువంక— జీవితంలోని వింతతీరుల వంక."

ఆ తరవాత నేను మౌనం వహించాను. నా స్నేహితుడు నొచ్చుకున్నాడు. నేను వేదాంతిలా అన్న ఆ మాట బుద్ధిపూర్వకంగా మటుకు అనలేదు. నాకు ఏదో కష్టమనిపించింది. ఆ సమయంలో ఎవరినీ నొప్పించాలని నా ఉద్దేశం కాదు.

సంభాషణ మార్చవలసి వచ్చింది. అందుకు నేనే పూనుకున్నాను. రోడ్డు వైపు ఉన్న హోటలు అద్దాలమీద రకరకాల పూవులు, ఫలాలు, పక్షుల బొమ్మలు చిత్రించబడి ఉన్నాయి. ఆ అద్దాలమీద బయటినుంచి పడుతున్న నీలిరంగు ప్రతిబింబించి అనేక వర్ణాల్ని సంతరించుకుంది.

ఆ రోజు పౌర్ణమి అని చటుక్కున నాకు జ్ఞాపకం వచ్చింది. ఆ నీలిరంగు చంద్రబింబానిది. వంగి, ఆకాశంలోని చంద్రుణ్ణి చూడాలని విఫల ప్రయత్నం చేశాను. ఢిల్లీ ఆకాశంలో దర్శన మిచ్చేందుకు ఈ చంద్రుడు బిడియపడటం లేదుకదా అనిపించింది.

నా ఆలోచనల్ని, నిశ్శబ్దాన్నీ భంగపరుస్తూ ఉన్నట్లుండి వాద్యాలమోత ప్రారంభ మయింది. మా చుపులు పాటంతట ఆవే ఆటు మళ్లాయి. ఎన్నో మార్లు ఆటువైపు చూసి, ఆ జీవం లేని వాద్యాలనుంచి నా చూపులు మరల్చుకున్నాను. తమ ఆటపాటలతో ఆ వాద్యాలకి జీవం పోసే వ్యక్తులు ఈ రోజు ఇంకా రాలేదు. వాళ్ల రాక కోసం ఎంతో ఆత్రతతో ఎదురుచూస్తున్నాను.

ఎవరి కోసరం నేను వేచి ఉన్నాను? ఆ పాట అన్నా, సంగీతమన్నా నాకు ఇష్టం లేదు. సంగీతంలో పూర్తిగా లీనమయే శక్తి నాకు లేదు. కానీ, ఎప్పుడైనా వ్యవధి చిక్కితే, ఈ హోటల్లోని ఏదో ఆకర్షణ నన్ను ఇటు లాగుతుంది.

అదిగో, నోరా మైకు ముందుకి వచ్చింది. ఆమె ముఖం నిండా, మెడ మీద ఎత్తుగా, జుగుప్సాకరంగా రంగు పూసుకుంది. పెదిమలమీద ముద్దగా లిప్‌స్టిక్ దూరంనుంచే కొట్టవచ్చినట్లు కనబడుతూంది. ప్రేక్షకుల్ని ఆనంద పరిచేందుకు గాయని నోరా ఆ హోటలు యజమానిచేత జీతంమీదఏర్పాటయింది. చేతులులేని చొక్కా, మోకాళ్ల పైకి మినీ స్కర్టూ—ఆమె అవయవాల సొంపు, ముఖభంగిమలు ప్రేక్షకుల్ని ఆనంద పరిచాయో లేవో కానీ, పాట ముగియగానే కరతాళధ్వనులు చేశారు. నేనూ చప్పట్లు చరిచాను. ఆ ఇంగ్లీషు గానంలో ఒక్క ముక్క నాకు అర్థం కాలేదు.

"ఛీ! ఘోరంగా ఉంది!" అన్నాడు నా స్నేహితుడు.

నేను నిస్సహాయంగా అతని వంక చూశాను. ఘోరంగా ఉన్నది ఏది? ఆమే, లేక గానమా? చప్పట్ల ప్రతిధ్వని

ఒరియా మూలం:

**శ్రీమతి నందినీ శత్‌పథి**

అనువాదం:

**ఉషారాణి భాటియా**

హోలులో ఇంకా మారుమోగుతూంది. "హనీ... హనీ" అనే ఆ పాట తాలూకు ధ్వని ఆ గది నలువైపులా ఆవరించి ఉంది.

"ఈ ఆడవాళ్లు ఇంకేదయినా గౌరవనీయమైన ఉద్యోగం చేయకూడదూ? రోజూ ఇలా అసహ్యమైన వేషం వేసుకుని దిక్కుమాలిన పాటలు పాడటం వల్ల స్వయంగా హాని కలుగజేసుకుంటున్నారు. సమాజాన్ని నరకం పాలు చేస్తున్నారు" అన్నాడు నా స్నేహితుడు.

నేను నవ్వాను. విరగబడి నవ్వాను. "అయితే, నువ్వెందుకు రోజూ ఇక్కడికి వస్తున్నావు? మానెయ్యి" అన్నాను.

అతని ముఖం గంభీరంగా మారిపోయింది. "నిజంగా చెబుతున్నాను. నవ్వులాట కాదు. నాకు ఈ ఆడవాళ్లంటే పరమ అసహ్యం. వీళ్లలో యవ్వనం ఏనాడో పోయింది. రంగులతో, పౌడర్లతో అందం నిలబెట్టుకోవాలనుకోవటం పిచ్చి కాదూ? ఈ రంగులు లేకుండా వీళ్ల ముఖాలెప్పుడైనా చూశావా?"

అతని కంఠంలో ఏవగింపు ఎక్కువవుతూంది.

నోరా జేబురుమాలు తీసి మెల్లగా ముఖంమీద చెమట తుడుచుకుంది. అలిసిపోయిన కాళ్లీడ్చుకుంటూ మెల్లిగా వేదిక దిగింది. నడుముకు బిగించి కట్టి ఉన్న తోలుబెల్టు ఊడదీసింది. మా ఎదురుగా ఉన్న గదిలో ఒక సోఫామీద కూర్చుంది. సంగీత దర్శకుడు ఆమె పక్కనే కూర్చున్నాడు. ఆమె వీపుమీద చెయ్యి వేసి, చేతులు పట్టుకుని ఏదో మాట్లాడుతున్నాడు. "కాఫీ, ఫలహారం తీసుకుంటావా?" అడిగాడు. ఫలహారం అంటే పకోడీలు లేక వడలు.

కాఫీ తాగుతూ నోరా పెదిమల మధ్య సిగరెట్ పెట్టుకుంది. ఒకటి అతనికి అందించింది. అతను సిగరెట్లు వెలిగించాడు.

నేను నోరాని గురించి ఆలోచిస్తున్నాను. బహుశః నా స్నేహితుడుకూడా అదే ఆలోచిస్తున్నాడు. కానీ, మా ఆలోచనలు భిన్నమైన దారుల్లో నడుస్తున్నాయి. అతను నోరాపట్ల జుగుప్సతో మండిపడుతున్నాడు. నేను?

నా స్నేహితుడు లేచి నిలబడ్డాడు. తిరిగి వెళ్లేందుకు వేళ అయింది. దైనందిన జీవిత కార్యక్రమాలు సాగిపోవలసిందే. ఫైల్సుమధ్య నోరాని గురించి ఆలోచించేందుకు అవకాశం ఏది? ఇతరుల కష్టాల్నీ, బాధల్నీ గురించి ఆలోచించి సానుభూతినీ, భావోద్రేకాన్నీ ప్రకటించే ప్రశ్నే లేదు. పని. పని. యాంత్రిక జీవితం. అంతే!

మేము వెళ్లాలి. తప్పదు. నేను లేచి

**కొందరు కొన్ని పనులు ఎందుకు చేస్తారో అర్థం కాదు. ఎంత ఆలోచించినా ఆ ప్రశ్నకు సమాధానం దొరకదు. సంఘాన్ని ఎదిరించి చేసే కొన్ని పనుల వెనుక త్యాగమయ జీవితాలు నరకం అనుభవిస్తూ కనిపించినప్పుడు— ఆ ప్రశ్నే మనసులో మెదిలితే — దీనికి సమాధానం ఎవరు చెప్పడానికి ముందుకు వస్తారు?**

నిలబడ్డాను. అనుకోకుండా తలుపు దగ్గిర నోరా కలిసింది.

"గుడ్ ఈవెనింగ్!" అని పలకరించింది.

"గుడ్ ఈవెనింగ్!" అన్నాను. అంతకుమించి ఏం మాట్లాడేందుకు వ్యవధి లేదు. ఆమె చటుక్కున లిఫ్టులోకి వెళ్లిపోయింది. నా స్నేహితుడు వెళ్లబోతూ నా వంక చూశాడు.

"ఏమిటి— నీ కావిడ తెలుసా?"

అతని ప్రశ్న కుతూహలంతో, వ్యంగ్యంతో నిండి ఉంది. అతని కళ్లలో అనుమానం వ్యక్తమవుతూంది.

"అవును, తెలుసు. ఆవిడ కుటుంబం అంతా తెలుసు" అన్నాను.

మేము బయట పేవుమెంటు మీదికి వచ్చేశాము. దుకాణాలన్నీ మూసే ఉన్నాయి. పేవ్‌మెంటుమీద అక్కడక్కడా కొంతమంది వస్తువు లమ్ముతున్నారు. సినిమాహాలు ముందు పూలమ్మేవాడు గుబాళించే జాజి, మల్లి, రోజా పూలతో తారట్లాడుతున్నాడు. కిళ్లీ దుకాణంముందు ఇంకా కొంత జనం నిలబడి ఉన్నారు. నా స్నేహితుడు దుకాణంముందు ఆగాడు.

"ఆవిడ నీ కెట్లా పరిచయం?" అనడిగాడు. ఈ మాటు అతని కుతూహలం ఎక్కువయింది.

అతనడిగిన విధం చూసి నాకు నవ్వాగలేదు. "అనుమానించకు. అంతా చెబుతాను. ఆవిణ్ణి గురించి తెలుసుకునేందుకు ఎంతో ప్రయత్నించాను" అని హామీ ఇచ్చాను.

"ఆశ్చర్యంగా ఉంది!"

"ఇందులో ఆశ్చర్యపడవలసింది ఏమీ లేదు. ఒక రచయిత్రిగా, కళాకారిణిగా నా కర్తవ్యం నిర్వహించాను. మానవ స్వభావంలోని వివిధ రీతుల్ని తెలుసుకోకుండా, ఒక రచయిత రచన ఎలా చేయటం? సామాన్యుడిలాగ అతనూ కృత్రిమ విమర్శ చేయలేడు కదా?"

చిక్కని చీకటి అలముకుంది. నా స్నేహితుడు మౌనం వహించాడు. రచయిత్రినన్నే గర్వభావంతో ఇతన్ని నొప్పించానా?

టాక్సీస్టాండు దగ్గిర అతను ఆగాడు. "టాక్సీ తీసుకుందామా?" అనడిగాడు. ఓ క్షణం తటపటాయించి మళ్లీ ఇలా అన్నాడు:

"బహుశః నువ్వు అలిసిపోయి ఉంటావు. అంతేకాదు. నోరాపట్ల నీ సానుభూతి భావాన్ని గాయపరిచాను. ఇంటికిపోయి విశ్రాంతి తీసుకుందాం పద— ఆవిడ కథ రేపు చెబుదువుగాని" అన్నాడు. మామూలుగా అయిపోయాడు.

"నువ్వు అంటున్నదేమిటి? పై పెచ్చు నేనే నిన్ను నొప్పించాను. దయచేసి నన్ను క్షమించు."

అతని రెండు చేతుల్నీ నా చేతుల్లోకి తీసుకున్నాను.

అతను నా చేయి పట్టుకుని ముందుకి నడక సాగించాడు. టాక్సీస్టాండు దాటాము. రాత్రి ఆట సినిమా చూసి వస్తున్న ప్రేక్షకుల కోలాహలం, కారు హారన్ల మోత దూరం కాజొచ్చాయి.

ఇప్పుడు ఢిల్లీ వీథులని గాఢమైన నిశ్శబ్దం ఆవరించింది. రోడ్లన్నీ నిద్ర పోతున్నాయి. ఆ నిద్రని భంగపరుస్తూ అప్పుడప్పుడూ ఓ కారు. ఓ మ్యాటరు పోతున్నాయి. పేవుమెంటుకి ఇరువక్కల ఉన్న చెట్లమీద పెద్ద పెద్ద నీటి బిందువులు రాలుతున్నాయి. బహుశః కొద్ది నిమిషాల ముందు వానజల్లు పడి ఉంటుంది.

"ఒంటరిగా ఉన్న ఈ రోడ్డుమీద నిస్సహాయంగా చెట్టు కన్నీరు కారుస్తోంది. నోరా జీవితం పైకి ఎంతో హాయిగా, విందుగా కనిపించినా ఈ చెట్టులాగ నిజానికి నిస్సహాయమూ, జాలి కరమూ అయినది.

ఆ రోజు ఆమెని అదే అడిగాను— 'ఇంతకంటే గౌరవనీయమైన వృత్తి తీసుకోరాదా?' అని. నోరా నన్ను తన ఇంటికి ఆహ్వానించింది. మేము టాక్సీ తీసుకున్నాము.

అది ఒక సన్నని సందు. ఆ ఇల్లు పాడుబడినట్లు ఉంది. ఆ చుట్టుపక్కల వెగటు కలిగించే పరిసరాలు చూసి నాకు టాక్సీ దిగబుద్ధి పుట్టలేదు. నోరా కళ్లు మెరుస్తున్నాయి. అవకాశం చిక్కితే మనలాటి స్వార్థపరులైన సమాజ సేవకుల్ని ఆ చూపులు భస్మం చేసేస్తాయా అనిపించింది. ఏదో మంత్రించినట్లు ఆమెని అనుసరించాను."

పక్కనే నడుస్తున్న స్నేహితుడు నాకు దగ్గిరగా జరిగాడు.

"ఓ చిన్న కుర్రాడు తలుపు తెరిచాడు. కుంటివాడు పట్టుకునే వంగలకర్రలను (క్రచ్చెస్) పట్టుకుని ఉన్నాడు. అతని గుడ్డలు మాసిపోయి చిరుగులు పట్టి ఉన్నాయి. అతని కళ్లలో అమాయకత్వం, దైన్యం వ్యక్తమవుతున్నాయి. నా వంక తదేకంగా చూశాడు. ఒక కర్ర వదిలేసి, నోరా చేతిని పట్టుకుంటూ, 'అమ్మా! ఈమె ఎవరు?' అనడిగాడు.

"నేను నిర్ఘాంతపోయాను— నోరాకి ఒక కొడుకా? ఈమెకి వివాహమయిందా? నా మెదడులో లెక్కలేనన్ని ప్రశ్నలు ఉదయించాయి. నోరా నా వైపు తిరిగి, 'నా కొడుకు. పోలియో వచ్చింది' అన్నది.


నవ్ భారత్ ఇన్‌వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్
ప్రైజ్ యూనిట్లను తక్షణమే ప్రకటించును

प्राइज यूनिट 100 PRIZE UNIT

ప్రైజ్ యూనిట్స్

నేటి నుండి

నెలకు రూ. 100/-లు నిలువజేయండి మరియు మీకు ప్రతి నెల 100 అవకాశముల చొప్పున వరుసగా 3 సంవత్సరములు రొక్కపు బహుమతి పొందవచ్చును. అదే కాకుండ ఒక లక్ష రూపాయల చొప్పున 3 దీపావళి రొక్కపు బహుమతులు కూడ గలవు.

అటు తదుపరి

సాలుకు నాలుగు శాతం వడ్డీ చొప్పున 3 సంవత్సరములకు మీ మూలధనంతో సహా పొందవచ్చును.

పూర్తి వివరములకు మరియు దరఖాస్తు ఫారము కొఱకు మీ షేర్ బ్రోకర్, భీమా ఏజెంటు గాని ప్రాంతీయ ప్రైజ్ యూనిట్ ఏజెంటును గాని దయచేసి సంప్రదించండి.

రిజిస్టర్డ్ ఆఫీసు: 32, న్యూ స్టాక్ ఎక్స్చేంజ్, 2వ అంతస్తు, అపోలో స్ట్రీట్, బొంబాయి-1.
బ్రాంచీలు: పూనా, బెంగుళూరు & అహమ్మదాబాదు, మద్రాసు, కలకత్తా దేశంలో 100 కన్న ఎక్కువ నవ్ ఆఫీసులు గలవు.

ఇది ఒక ప్రకటన మాత్రమే మరియు ప్రాస్పెక్టస్ మాత్రం కాదు.

721 TEL.

నిలబెట్టుకున్నా, లేకపోయినా, తొందరపడి చేసిన ప్రమాణాలు అవమానాలకు దారి తీస్తాయి.

—జాన్సన్

ఆమె తీసుకెళ్లిన గదిలో నాకు ఊపిరాడలేదు. గదిలో ఓ పక్కగా రెండు చిన్న నులకమంచాలు ఉన్నాయి. వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. అక్కడ మరో రెండు ప్రాణాలున్నట్లు కనిపెట్టడం కష్టమయింది. చిరుగులు పట్టి మాసిపోయిన పరుపులో ఒకతను పడుకుని ఉన్నాడు. ఆ గదిలో బల్బ్ కాంతి ఎక్కువగా లేదు. ఆ కాంతికి గది ప్రకాశవంతం కావటం పోయి భయంకరమైన వాతావరణం ఏర్పడింది.

ఆ మంచాలమీద పడి ఉన్న రెండు ప్రాణాలు ఉన్నట్లుండి కదిలాయి. ఒక మంచంమీంచి ఓ ముసలావిడ లేచి కూర్చుంది. చిక్కి శల్యమై ఉంది, ఉబ్బసం రోగంతో. ఊపిరి ఎగపీలుస్తూ, నోరా ఆలస్యంగా వచ్చిన కారణం అడిగింది. నోరా అందుకు జవాబు చెప్పలేదు.

'ఈవిడ మా అత్తగారు. ఆరోగ్యం లేదు. ఉబ్బసం వ్యాధి. రోజూ నేను ఏమేం చేసేందీ, ఎందుకు ఆలస్యంగా వచ్చిందీ సంజాయిషీ చెప్పుకోవాలి.'

ఆమె కంఠంలో ఏ ఉద్రేకమూ లేదు. టూరిస్టు గైడులాగ యాంత్రికంగా చెప్పుకుపోతోంది.

రెండో మంచంవైపు చూపించింది. పాలిపోయిన ముఖంలోంచి రెండు లోతైన కళ్లు మా వంక చూస్తున్నాయి. నోరా దగ్గరగా వెళ్లింది. నేనూ ఆమెని అనుసరించాను. ఆ సజీవ మృతకళేబరంలోంచి ఈ మాటలు వెలువడ్డాయి.

'ఇప్పుడు వీళ్లంతా ఇళ్లకి రావటం కూడా ప్రారంభించారా?'

నేను అదిరిపడి వెనక్కి తగ్గాను. నోరా గట్టిగా నవ్వింది. పిచ్చిదానిలా పగలబడి నవ్వింది. వేలితో అతన్ని, చూపెడుతూ, 'నా భర్త. క్షయరోగి. నా భర్త. నా దైవం' అంది.

మరుక్షణం ఘొల్లున ఏడవటం ప్రారంభించింది. ఆ నవ్వులోనే ఏడుస్తోంది నోరా!"

అప్రయత్నంగానే మే మిద్దరం రోడ్డుపక్కగా ఆగి నిలబడ్డాము. నా స్నేహితుడు నా చేతిని తన చేతిలోకి తీసుకుని గట్టిగా నొక్కాడు.

"ఇక పోదాం" అన్నాను.

"నన్ను క్షమించు."

నా చెయ్యి ఇంకా అతని చేతిలోనే ఉంది. ★

# ఈ ఉగాది మొదటి రోజు

మాదిరాజు రంగారావు

గాలి వెలుతురు ఆడని
   నిశ్శబ్దం గడ్డకట్టిన గదిలో
రాతిపలకవలె నిలువక రా
తలుపులు తెరచుకొని బయటికి,

గాలి వెలుతురు సోకని
నిశ్శబ్దం దిగమ్రింగిన మదితో
మంచుబొమ్మవలె మండక రా
బయటికి విచ్చుకొని ఊహలు,

రా బయటికి వచ్చి చూడు
చిరుగుపట్టిన బ్రతుకు బొంతలు
చూడు దిక్కులు అంతటా
నలుపు తిరిగిన ఎరుపుగీతలు

క్షుబ్ధతరంగ సంకులమైన సముద్రం
కఠిన శైలబంధురమైన పర్వతం
సముద్రం మ్రింగజూస్తుంది పర్వతాన్ని
పర్వత మాక్రమించజూస్తుంది సముద్రాన్ని.

కుచేల సంతాన మంటిస్తోంది నిప్పు
కుబేర పట్టణాలు మండేను భగభగ
పొగ దూరిన కనులు నులుముకుంటూ
ప్రజలు జ్ఞాపకం చేసుకునేరు దేవుణ్ణి.

ఈ రోజు సంవత్సరం మొదటిది
గదినుండి బయటపడిన నీకు
ఆకాశం పలుకుతూంది ఆహ్వానం
భూమి చెబుతూంది స్వాగతం.

ఆకాశాన సూర్యునివలె
వెలుగనీ శక్తి నీలో,
రా బయటికి నీ కాళ్లపై
ఎగురు పైకి నీ రెక్కలతో.

వంచేవానికే వంగుతుంది విల్లు
శక్తి గలానికే పలుకుతుంది లోకం.
గాలి, అగ్ని రూపం కావచ్చు ఆ శక్తి
నీరు మనస్రూపం కావచ్చు ఆ శక్తి

చీకటి దారిద్ర్యం నిండిన
ఇరుకు అజ్ఞానం క్రమ్మిన
ఈ గదినుండి ఈ నాడు
ఈ ఉగాది మొదటిరోజు

ఉషఃకిరణంవలె రా బయటికి
కాలగతిని వేగం చేస్తూ.

విప్లవ కంఠంలో
   శాంతిస్వరమై ఎగసి
శ్మశానవేదికపై
   ప్రాణస్పందమై సాగి
మంచుపొరలలో
   వెలుగురేకై విరిసి
నింగి సిగపైన
   దినమణియై వెలిగి
శూన్య నయనాలలో
   మేఘమై తూగుతూ
స్వాప్నిక జగత్తు చెరపి
   వాస్తవమై నిలచి
దారిద్ర్యం తాండవించు శిశిరంలో
వసంత భావనతో
దాహంతో అటమటించు గ్రీష్మంలో
జీవనదీ రూపంతో
కాల రూపం మార్చే
శాంతిగీతమై కదలి రా.

చివురు, వేరు— జడమా?
అయితే మన హృదయం?
మనసుకు రూపం లేదూ?
అయితే మన భావన!

పరిణామంలో శిఖరమైన
మానవునిలో ఉంది
ఆ పూర్వ పూర్వ రూపం
అందుకే ఇంత అలజడి.

సంస్కృతికి మౌళియైన
జీవనంలోనూ ఉంది
ఆ ఆటవిక మనస్తత్త్వం
అందుకే ఇంత ఆక్రందం.

అలజడి ఆవరించిన చోట
   ఆర్ద్రరాగమై కదలి రా
ఆక్రందం అలముకొన్నవేళ
   శాంతికపోతమై రా
రేఖాబిందువు మొదలైన చోటు
ఈ ఉగాది మొదటిరోజు. ★